


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 298 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం గురువారం 3 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 298 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM THU 3 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి చేరిన గోదావరి జలాలు
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చామని చెప్పిన సీఎం చంద్రబాబు
- భవిష్యత్తులో సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తామని ప్రకటన
- గత ప్రభుత్వం విధ్వంసం చేస్తే, తాము అభివృద్ధి చేస్తున్నామని విమర్శ
- ఉత్తరాంధ్రను ఉన్నతాంధ్రగా మార్చడమే లక్ష్యమన్న ముఖ్యమంత్రి



# అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది..
# ఇది ఖాయం.. రాసిపెట్టుకోండి



ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు.

## మాట నిలబెట్టుకున్నాం.. పునర్నిర్మాణం చేస్తున్నాం

గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు.

- మిగతా 2లో



రాష్ట్రంలో సాగునీటి పండుగ..

## చంద్రబాబు అపర భగీరథుడు

- రాష్ట్రంలో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందన్న పట్టాభి
- గోదావరి-కృష్ణా అనుసంధానాలతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని వ్యాఖ్య
- వైసీపీ నేతలు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధానం, సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణతో నిజమైన భగీరథ ప్రయత్నం జరుగుతోందని

- మిగతా 2లో

## ఈ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరింది

### పాయకరావుపేటలో అనిత



- పోలవరం ఎడమ కాలువ ద్వారా ఉత్తరాంధ్రకు చేరిన గోదావరి జలాలు
- సీఎం చంద్రబాబు సంకల్పం వల్లే ఐదు దశాబ్దాల కల నెరవేరిందన్న హోంమంత్రి అనిత
- గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును దెబ్బతీసిందని విమర్శ
- చంద్రబాబు అపర భగీరథుడని, ఒక్క ఓటుతోనే గోదారిని తెచ్చుకున్నామని వ్యాఖ్య
- పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేసే రోజు ఎంతో దూరంలో లేదని ధీమా

- మిగతా 2లో



## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.

### టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం ఇంట ఏసీబీ సోదాలు

- తిరుపతి, తిరుమలలోని ఇల్లు, ఆఫీసులో ఏకకాలంలో దాడులు
- బంధువుల ఇళ్లు, గెస్ట్ హౌస్‌పైనా ఏసీబీ అధికారుల తనిఖీలు
- ఏడు ప్రత్యేక బృందాలతో కొనసాగుతున్న సోదాలు

- మిగతా 2లో

## నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

- పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్
- నరసరావుపేట జేఎన్టీయూకేలో నూతన హాస్టల్ భవనాల ప్రారంభం
- రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం
- గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో వసతి గృహాల నిర్మాణం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

- మిగతా 2లో



# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"

### కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్



- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల
- కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ
- రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపణ
- రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్
- కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశం లో

- మిగతా 2లో

# 'అది విధ్వంసక చర్యే'..

### పాక్‌లో ఆలయం కూల్చివేతను ఖండించిన భారత్



పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఇటీవల దాదాపు వందేళ్ల పురాతన ఆలయం కూల్చివేతను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనను విధ్వంసకర చర్యగా పేర్కొంది. ఈ వ్యవహారంలో అధికారుల ఉదాసీనత, శతాబ్దం క్రితం నాటి ఆలయాన్ని పరిరక్షించడంలో వారి వైఫల్యం ఆందోళనకరమని తెలిపింది.

- మిగతా 2లో



## నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు.. మళ్లీ వరద ముప్పు!

- నేపాల్‌లో భారీ వర్షాలతో పలు నదులకు పోటెత్తిన వరదలు
- మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టం హెచ్చరిక స్థాయిని దాటిన వైనం
- మర్స్యంగ్డి నదిలో ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్న వరద
- నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక
- దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటమే వరదలకు కారణం

పెన్ పవర్ డెస్క్:హిమాలయ దేశం నేపాల్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రధాన నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకర స్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో, అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలందరూ

- మిగతా 2లో

# ఇది భిక్ష కాదు



### భారత్, చైనా, అమెరికా నుంచి నష్టపరిహారం కోరిన నేపాల్ మంత్రి

పెన్ పవర్ డెస్క్:నేపాల్‌ను ముంచెత్తిన ఘోర జలప్రళయం తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వేళ, ఆ దేశ ప్రభుత్వం అంతర్జాతీయ వేదికలపై కీలక విజ్ఞప్తి చేసింది. ప్రపంచంలోనే అత్యధికంగా గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తున్న భారత్, చైనా, అమెరికా దేశాల నుంచి 'వాతావరణ మార్పుల నష్టపరిహారం' కోరుతూ నేపాల్

- మిగతా 2లో

- నేపాల్ ఆకస్మిక వరదల వల్ల ఇప్పటి వరకు 11 వందల మందికి పైగా మృతి
- పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము మూల్యం చెల్లించుకుంటున్నామన్న నేపాల్
- తమకు నష్టపరిహారం చెల్లించడం చట్టపరమైన బాధ్యత అని వ్యాఖ్య



## అన్నయ్యా.. మీరే నా మొదటి హీరో

పెన్ పవర్ డెస్క్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు బర్త్‌డే శుభాకాంక్షలు చెప్పిన వారందరికీ పవన్ కృతజ్ఞతలు చెప్పారు. తన సోదరుడు,

- మిగతా 2లో

## నాన్నే నా స్ఫూర్తి

### వైయస్ఆర్‌ను తలచుకుంటూ.. వైయస్ జగన్ భావోద్వేగ సందేశం

పెన్ పవర్ డెస్క్: మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా వైయస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# రాష్ట్రంలో సాగునీటి పండుగ.. చంద్రబాబు అపర భగీరథుడు

- మొదటి పేజి తరువాయి
ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి కొనియాడారు. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రారంభించారని... పోలవరం కాలువను కూడా ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాలతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొందని, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంతో ఏపీ సస్యశ్యామలం కాబోతోందని హర్షం వ్యక్తం చేశారు.దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్‌ల క్యాలెండర్‌ను విడుదల చేసిందని, అందులో కేటాయించిన 36 ప్రాజెక్టుల్లో ఏకంగా 14 ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంతానికే చెందడం సీమ పట్ల చంద్రబాబుకు ఉన్న అంకితభావానికి నిదర్శనమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష వైసీపీపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత ఐదేళ్ల పాలనలో జగన్ రాయలసీమ ప్రాజెక్టులకు కనీసం రూ.2,000 కోట్లు కూడా ఖర్చు చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పంకు నీళ్లిచ్చామని చెప్పి ట్యాంకర్లతో నీటిని తెచ్చి డ్రామాలు ఆడారని.. కానీ చంద్రబాబు మాత్రమే నిజంగా కుప్పంకు నీటిని తీసుకెళ్లారని గుర్తుచేశారు. అన్నమయ్య ప్రాజెక్టు గేట్లకు గ్రీజ్ కూడా పూయలేని చేతకానితనంతో నాటి ప్రభుత్వం విపత్తును కొనితెచ్చిందని విమర్శించారు. టీబీ డ్యామ్ గేట్లను యుద్ధప్రాతిపదికన మార్చి నీటి నిల్వపై భరోసా కల్పించింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు.వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన పట్టాభి... వారు క్రెడిట్ చోరీ డిజార్డర్ తో బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. రివర్స్ టెండరింగ్ పేరిట వేల కోట్లు దోచుకుని, పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి, పనులు 17 నెలలు నిలిచిపోవడానికి జగనే కారణమని ఆరోపించారు. జగన్ హయాంలో 'జలయజ్ఞం' కాస్త 'ధనయజ్ఞం'గా మారిందని... అనుమతులు లేని రాయలసీమ లిఫ్ట్ పేరుతో మట్టి పనుల కింద వైసీపీ నేత పెద్దిరెడ్డికి రూ.1,000 కోట్లు దోచిపెట్టారని మండిపడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు కడుపుమంటతో అల్లాడిపోతున్నారని అన్నారు.

# ఇది భిక్ష కాదు

- మొదటి పేజి తరువాయి
విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ సంచలన ప్రకటన చేశారు.భోటేకోషి నదిలో సంభవించిన ఆకస్మిక వరదల వల్ల ఇప్పటికే 1,100 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది గల్లంతయ్యారు. ఈ తీవ్ర విపత్తు వాతావరణ మార్పుల వల్ల హిమనీనదాలు (గ్లేసియర్లు) విరుచుకుపడటం వల్లే సంభవించిందని శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. వాతావరణ మార్పులకు తమ దేశం కారణం కాకపోయినా, అతిపెద్ద పారిశ్రామిక దేశాలు విడుదల చేసే ఉద్గారాల వల్ల తాము తీవ్ర మూల్యం చెల్లించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు ఇచ్చే సాయం లేదా భిక్ష కాదని, బాధితులకు చెల్లించాల్సిన చట్టపరమైన, నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు.తమ దౌత్య విధానాన్ని 'సాయం కోరడం' నుంచి 'న్యాయం, నష్టపరిహారం పొందే' దిశగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ఈ అంశాన్ని ఐక్యరాజ్యసమితి గ్లోబల్ లాస్ అండ్ డ్యామేజ్ ఫండ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు... రానున్న ఐరాస సర్వసభ్య సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తనున్నట్లు సమాచారం. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలు, పునర్నిర్మాణానికి ప్రాథమికంగా 4 నుంచి 5 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు.

# నాన్నే నా స్ఫూర్తి

- మొదటి పేజి తరువాయి
తన తండ్రిని స్మరించుకుంటూ భావోద్వేగ సందేశాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "మిస్ యూ ఆల్వేస్, డాడ్! యూ విల్ ఫరెవర్ బీ మై ఇన్‌స్పిరేషన్" అంటూ తండ్రిపై తనకున్న ఆప్యాయతను వ్యక్తం చేశారు.
వైయస్ఆర్ తనకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని వైయస్ జగన్ పేర్కొన్నారు. తండ్రితో తనకున్న అనుబంధాన్ని, ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అంతకుముందు ఇడుపులపాయలోని వైయస్ఆర్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, పార్టీ కేడర్‌తో కలిసి మహానేతకు నివాళులర్పించారు.

## అన్నయ్యా.. మీరే నా మొదటి హీరో

- మొదటి పేజి తరువాయి
అగ్ర కథానాయకుడు చిరంజీవి విష్ చేస్తూ పెట్టిన పోస్టుకు ఉద్వేగభరితంగా స్పందించిన పవన్.. తన ఎదుగుదలకు ఆయన ఇచ్చిన ప్రోత్సాహాన్ని గుర్తు చేసుకుంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు."మీ ప్రేమ, ఆప్యాయత, శుభాకాంక్షలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. చిన్ననాటి నుంచి నాపై మీరు చూపిన నమ్మకం, ఇచ్చిన అండ నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైనవి. తండ్రి స్థానంలో నిలిచి నాకు దిశ చూపిన మీరు నా జీవితంలో మొదటి హీరో. జీవితంలో ఏం సాధించాలో తెలియని రోజుల నుంచి నన్ను నడిపించిన మీ మాటలు, మీ ఆలోచనలు నాతోనే ఉన్నాయి.కుటుంబం పట్ల మీ ప్రేమను, సమాజం పట్ల మీ బాధ్యతను, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలనే మీ తపనను చూస్తూ పెరిగాను. ఆ అనుభవాలే నా ఆలోచనలకు ఒక దిశను ఇచ్చాయి. మీరు నా జీవితానికి ఎప్పటికీ మార్గదర్శి. మన ఇలవేల్పు శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులతో, మీ ఆశీస్సులతో ముందుకు సాగుతాను" అని పవన్ పేర్కొన్నారు.

## నాదెండ్ల పవన్ ను తప్పుదోవ పట్టిస్తున్నారా?

# ఎవరి మనసులో ఏముంది?

జనసేన పార్టీలో కీలక నేత నాదెండ్ల మనోహర్ పై ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. నాదెండ్ల తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కు రాజకీయంగా తప్పుదోవ పట్టిస్తున్నారన్న భావన క్యాడర్ లో నెలకొంది. అంతా తానే అయి.. అధినేతను ఎవరినీ కలవనివ్వకుండా, వాస్తవ విషయాలను చెప్పనివ్వకుండా దాచి ఉంచుతున్నారని సోషల్ మీడియా వేదికగా ఆరోపిస్తున్నారు. నాదెండ్ల మనోహర్ పై ఇటువంటి ఆరోపణలు కొత్తేమీ కాదు. జనసేన పార్టీ పెట్టిన నాటి నుంచి పవన్ కల్యాణ్ వెన్నంటే ఉన్న నాదెండ్లను పార్టీ నేతలు, కార్యకర్తలు వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. తమ వ్యతిరేకతను సోషల్ మీడియాలో వ్యక్త పరుస్తున్నారు. అంతే తప్పించి సభల్లోనూ, సమావేశాల్లోనూ పవన్ కల్యాణ్ కు చెప్పేందుకు మాత్రం ప్రయత్నం చేయడం లేదు. అయితే నాదెండ్ల కేవలం పవన్ చేసిన సూచనల మేరకే అమలు చేస్తున్నారని, ఇందులో ఆయన తప్పేముందని కూడా కొందరు నాదెండ్ల మనోహర్ ను సమర్థిస్తున్నారు.

**పార్టీలో కీలకంగా మారడంతో...**

ఇక ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ కల్యాణ్ అస్వస్థతకు గురి కావడం, చంద్రబాబుతో భేటీలోనూ, పార్టీ నేతల సమావేశంలోనూ నాదెండ్ల మనోహర్ కీలకం గా వ్యవహరిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఆయనను నమ్మి కీలక పాత్రను అప్పగించారని చెబుతున్నారు. జనసేన పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్, ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పై పార్టీ క్యాడర్ మరియు నేతల్లో కొంత అసంతృప్తి ఉందనే ప్రచారం సోషల్ మీడియా మరియు కొన్ని రాజకీయ వర్గాల్లో సాగుతుంది. .ప్రస్తుతం జనసేన పార్టీ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తమవుతున్న తరుణంలో, నాయకత్వం మరియు క్యాడర్ మధ్య సమన్వయం కోసం ఆయన విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. గెలిచే స్థానాల్లోనే పోటీ చేయాలని, బలం లేని చోట పోటీకి దిగవద్దని నాదెండ్ల మనోహర్ మనోహర్ వ్యాఖ్యానించడం దిగువ శ్రేణి నేతల్లో ఆగ్రహానికి కారణమయింది.

# అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది.. ఇది ఖాయం.. రాసిపెట్టుకోండి

- మొదటి పేజి తరువాయి
హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు.

**ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే జల ప్రణాళిక**

ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
"గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గడ్డలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు.
విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దార్శనికత**

"సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు.
"ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజలకు పిలుపు.. భవిష్యత్తుకు భరోసా**

గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "పాలకులం కాదు, మీకు సేవకులం. పదవి అంటే పెత్తనం కాదు, జవాబుదారితనం. మాకు అహంకారం లేదు, అంకితభావం ఉంది" అని అన్నారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే"

- మొదటి పేజి తరువాయి
కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.
రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

## 'అది విధ్వంసక చర్యే'..

# పాక్‌లో ఆలయం కూల్చివేతను ఖండించిన భారత్

- మొదటి పేజి తరువాయి
"పాకిస్థాన్‌లో వందేళ్ల క్రితం నాటి ఆలయంపై జరిగిన విధ్వంసకాండను ఖండిస్తున్నాం. ఇలాంటి ఘటనలు ఆ దేశంలో మైనారిటీల దుస్థితిని, అలాగే వారి మత స్వేచ్ఛ, ప్రార్థనా మందిరాల విషయంలో జరుగుతున్న ఉల్లంఘనలను స్పష్టం చేస్తున్నాయి. సంబంధిత ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం తక్షణమే పారదర్శకంగా విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా.. ఆ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు చొరవ చూపాలి. మైనారిటీల భద్రత, వారి సాంస్కృతిక వారసత్వానికి భరోసా కల్పించాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

**ఆమె గౌను ఫ్యాషన్ కాదు.. 'ప్రసవ వేదన' కథ**

నరోవల్‌లోని సిరాజ్ గ్రామంలో ఉన్న ఆ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని పక్కనే ఉన్న మదర్సాలో కలిపేందుకు మత ఛాందసవాదులు కూల్చివేతకు పాల్పడ్డారని స్థానిక ప్రజలు, మైనారిటీ సంస్థలు, రాజకీయ నేతలు పేర్కొన్నారు. అయితే, ఈ పాత ఆలయం భారీ వర్షాల కారణంగా ధ్వంసమయ్యిందని ప్రభుత్వం చెబుతోంది.

# నేపాల్‌లో ఉగ్రరూపం దాల్చిన నదులు.. మళ్లీ వరద ముప్పు!

- మొదటి పేజి తరువాయి
అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటల నాటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు, లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్ది నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుందెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొంది. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది.
ఈ పరిణామాల నేపథ్యంలో, నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) ప్రజలకు కీలక సూచనలు చేసింది. ముఖ్యంగా మర్స్యంగ్ది నది దిగువ ప్రాంతాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని కోరింది. నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాజధాని ఖాట్మండు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలు అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

# నరసరావుపేట జేఎన్టీయూలో నూతన హాస్టళ్లను ప్రారంభించిన మంత్రి లోకేశ్

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పల్నాడు జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా నరసరావుపేట మండలం కాకాని గ్రామ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో (జేఎన్టీయూ కాకినాడ పరిధి) నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాలను ఆయన ప్రారంభించారు. రూ.70 కోట్ల వ్యయంతో 1,600 మంది విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆధునిక సౌకర్యాలతో ఈ వసతి గృహాలను నిర్మించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రి లోకేశ్ ఆవిష్కరించారు. అనంతరం గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం తర్వాత హాస్టల్ ప్రాంగణాన్ని, గదులను కలియతిరిగి విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు యూనివర్సిటీ యాజమాన్యం, విద్యా ర్థులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు. టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం ఇంట ఏసీబీ సోదాలు

టీటీడీలో అవినీతి ఆరోపణలు కలకలం రేపాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈవో) ఎం. లోకనాథం నివాసం, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఈరోజు దాడులు నిర్వహించారు. తిరుపతి, తిరుమలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి.ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఏడు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. ఈరోజు ఉదయం 6 గంటలకే అధికారులు తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఉన్న లోకనాథం నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇంట్లోనే ఉండగా తనిఖీలు ప్రారంభించారు. అదే సమయంలో తిరుమలలోని ఆయన కార్యాలయంలో మరో బృందం సోదాలు చేపట్టింది. ఈ దాడులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా జరుగుతున్నాయని ఏసీబీ వర్గాలు తెలిపాయి.ఈ సోదాలను అధికారులు బహుళ ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. తిరుపతిలో లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లలో, యెర్పేడు మండలం చెల్లూరులో ఉన్న ఆయన సోదరి నివాసంలోనూ తనిఖీలు చేపట్టారు. తిరుమలలో లోకనాథంకు సంబంధం ఉందని భావిస్తున్న ఒక గెస్ట్ హౌస్‌లో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. విచారణలో భాగంగా తిరుపతి ఎస్టీవీ నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలో ఉన్న లోకనాథం బ్యాంక్ లాకర్లను కూడా అధికారులు తెరిచి పరిశీలిస్తున్నారు. లోకనాథం ప్రస్తుతం శ్రీవారి ఆలయం టెంపుల్ డిప్యూటీ ఈవోగా కీలక బాధ్యతల్లో ఉండగా, గతంలో టీటీడీలో వివిధ హోదాల్లో పనిచేశారు.గత దశాబ్ద కాలంలో ఒక టీటీడీ ఉన్నతాధికారిపై ఏసీబీ సోదాలు నిర్వహించడం ఇది రెండోసారి. 2016లో అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. భూపతి రెడ్డి నివాసంపైనా ఇదే తరహా ఆరోపణలతో ఏసీబీ దాడులు చేసింది. అప్పట్లో ఆయనకు సంబంధించిన 12 ఇంటి స్థలాలు, ఒక అపార్ట్‌మెంట్, నాలుగు అంతస్తుల భవనం పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లోకనాథం ఆస్తులపై సోదాలు కొనసాగుతుండగా, పూర్తి వివరాలు తనిఖీల తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఈ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరింది

ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు ఈ ప్రాంతానికి చేరాయి. ఈ చారిత్రక ఘట్టంపై రాష్ట్ర హోం శాఖ మంత్రి, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు దృఢ సంకల్పం, అవిశ్రాంత కృషి వల్లే సాధ్యమైందని కొనియాడారు. "నీరు ఉన్నచోటే జీవం, ప్రగతి, అభివృద్ధి ఉంటాయి. ఐదు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న కలను నిజం చేసిన మహనీయుడు చంద్రబాబు" అని ఆమె ప్రశంసించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అనిత మాట్లాడుతూ.. "పోలవరం కేవలం ఒక ప్రాజెక్టు కాదు, అదొక జీవనాడి, ఒక ఎమోషన్. మన చిన్నతనం నుంచి వింటున్న పోలవరం ఈరోజు కళ్లముందు సాకారం కావడం చంద్రబాబు దయవల్లే సాధ్యమైంది. ఆలోచనలు ఎవరికైనా వస్తాయి, కానీ వాటిని కార్యరూపంలో పెట్టే దృఢ సంకల్పం, పట్టుదల, దైవానుగ్రహం అన్నీ కలిస్తే ఆరు అడుగుల రూపంలో మన ముందున్న చంద్రబాబు గారు" అని అన్నారు. ఈ బృహత్కార్యంలో చంద్రబాబుకు రాముడి వెంట హనుమంతుడిలా సహకరిస్తున్నారంటూ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గత ఐదేళ్ల పాలనపై అనిత తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2014-19 మధ్య చంద్రబాబు పోలవరం పనులను 72% పూర్తి చేస్తే, ఆ తర్వాత వచ్చిన గొడ్డలిపాటి నేతలు రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టును నాశనం చేశారు. ఐదేళ్లలో కనీసం 2% పనులు కూడా చేయకుండా ఆటంకాలు సృష్టించారు. ప్రాజెక్టు ఐదేళ్లు ఆలస్యం కావడం అంటే ఒక రైతు జీవితంలో ఐదేళ్ల నిరీక్షణ, ఒక ప్రాంత అభివృద్ధిలో ఐదేళ్ల వెనకడుగు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి అసెంబ్లీలో "పోలవరం ఎవరి చేతిలో ప్రారంభం కావాలో రాసిపెట్టి ఉందో, ఆయనే పూర్తి చేస్తారు" అని చెప్పిన మాటలను ఆమె గుర్తుచేశారు. ఆ దైవ సంకల్పం చంద్రబాబు రూపంలో నెరవేరిందని పేర్కొన్నారు.చంద్రబాబును 'అపర భగీరథుడు'గా అభివర్ణించిన అనిత, "పురాణాల్లో భగీరథుడు గంగ కోసం ఘోర తపస్సు చేశాడు. కానీ మనం గోదారమ్మ తల్లిని ఉత్తరాంధ్రకు తీసుకురావడానికి చంద్రబాబుకు ఒకే ఒక్క ఓటు వేశాం. ఆ ఒక్క ఓటుతోనే నాసిక్‌లో పుట్టిన గోదావరి 180 కిలోమీటర్లు ప్రయాణించి మన పొలాల దాకా వచ్చింది" అని అన్నారు. గతంలో వెనుకబడిన నియోజకవర్గంగా ఉన్న పాయకరావుపేట, నేడు ఆర్సెలర్ మిట్టల్ వంటి పరిశ్రమలతో పారిశ్రామిక, వ్యవసాయ ముఖద్వారంగా మారిందని తెలిపారు."ఒకే ఒక్క ఓటు గోదారమ్మను, ఆర్సెలర్ మిట్టల్‌ను, భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను, పరిశ్రమలను తీసుకొచ్చింది. సరైన వ్యక్తికి సరైన సమయంలో ఓటు వేస్తే ఇంత అభివృద్ధి జరుగుతున్నప్పుడు, మాకు మరో వ్యక్తికి ఓటేయాలన్న ఆలోచన కూడా రాదు. మీరే మా ముఖ్యమంత్రి, మీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం" అని అనిత ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసే రోజు ఎంతో దూరంలో లేదని, ముఖ్యమంత్రి వెంటే తామంతా నడుస్తామని స్పష్టం చేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ఘనంగా వై.ఎస్.ఆర్ 17వ వర్ధంతి కార్యక్రమం...



**అడ్డతీగల ,పెన్ పవర్, సెప్టెంబర్ 02:** బుధవారం మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించు కొని, అడ్డతీగల వైసిపి నాయకులు, కార్యకర్తలు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అడ్డతీగల మాజీ సర్పంచ్ పప్పుల. చిట్టెమ్మ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి వై ఎస్ ఆర్ చేసిన సేవలను కొనియాడారు. అడ్డతీగల ఎంపీపీ బొడ్డపల్లి.రాఘవ మాట్లాడుతూ వై ఎస్ ఆర్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు చేయూతనందిం చిన మహా నేత అని, పేదల ఆశాజ్యోతి అని వైయస్సార్ లేని లోటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎవరు తీర్చలేనిదని ఎంపీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొని వై ఎస్ ఆర్ కు ఘన నివాళులు అర్పించారు.

# గోదావరి పుష్కరాలకు భక్తులకు అనువుగా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలి

## క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిషోర్





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 2:** రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుష్కర ఘాట్‌లకు చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించేలా సమగ్ర రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి.నరసింహ కిశోర్, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ తదితర అధికారులు దేవీచౌక్, గోదావరి రైల్వే స్టేషన్, మణిపాల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాంతం, పుష్కర్ ఘాట్, పుష్కర్ వాటర్ పంపింగ్ ప్రాంతాలను పరిశీలించి, పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన రూట్ మ్యాప్, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అధికారులకు సూచనలు చేశారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి, ఘాట్‌లను అనుసంధానించే ప్రధాన, అంతర్గత రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజా రవాణాకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రధాన మార్గాల్లో గుంతలు, రహదారి సమస్యలు లేకుండా ముందస్తు మరమ్మతులు, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భక్తుల వాహనాలను నగర శివార్లలో ఏర్పాటు చేసే పార్కింగ్ ప్రాంతాల్లో నిలిపి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా ఘాట్‌లకు తరలించే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ప్రత్యేక బస్సులు నిరంతరాయంగా నడిచేలా చర్యలు తీసుకుంటూ, నగరంలోని ప్రధాన ఘాట్‌లకు సులభమైన ప్రవేశ మార్గాలు ఉండేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. బస్సులు ఏయే మార్గాల్లో నడపాలి, ఏ ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాటు చేయాలి, ఘాట్‌లకు అనుసంధానించే రహదారులను ఎలా వినియోగించాలనే అంశాలపై సమగ్ర కసరత్తు చేయాలని సూచించారు. గోదావరి రైల్వే స్టేషన్ వద్ద అదనపు రైళ్లు నిలిచే అవకాశం ఉన్నందున, భక్తుల రాకపోకలకు అనుగుణంగా రూట్ మ్యాప్‌లు, బారికేడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. నడకదారిన ఘాట్‌లకు వచ్చే భక్తులకు మార్గమధ్యంలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు ఘాట్‌లకు త్వరగా చేరుకునేలా ప్రత్యేక ఎమర్జెన్సీ పాయింట్లు, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించాలని తెలిపారు.

**భక్తుల భద్రతకు ప్రాధాన్యత: ఎస్పీ డి.నరసింహ కిషోర్**

పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపారు. ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, ఘాట్‌లకు వెళ్లే మార్గాల్లో వాహనాల రాకపోకలు, భక్తుల నడక మార్గాలను వేర్వేరుగా గుర్తించి అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, పార్కింగ్ ప్రాంతాల నుంచి ఘాట్‌ల వరకు ప్రత్యేక బస్సుల రాకపోకలకు అనుగుణంగా ట్రాఫిక్ రూట్‌లను రూపొందిస్తామని చెప్పారు. అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యేక మార్గాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, సహాయ కలెక్టర్ కె.ఆదిత్య శర్మ, అదనపు ఎస్పీ(అడ్మిన్) పాటిల్ దేవరాజ్ మనీష్, డీఎస్పీ వై.శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గొల్లగుప్పలో పరిస్థితి సాధారణం

**కొత్తగా కేసులు నమోదు కాలేదు.. ప్రజల ఆరోగ్యం స్థిరం**
**భద్రాచలం ఆసుపత్రిలో 52 మందిలో 32 మంది డిశ్చార్జ్**
**పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**



**భద్రాచలం/ఏటిపాక, సెప్టెంబర్ 2 (పెన్ పవర్):** పోలవరం జిల్లా ఏటిపాక మండలం గొల్లగుప్ప గ్రామంలో ప్రస్తుతం పరిస్థితి సాధారణంగా ఉందని, కొత్తగా ఎటువంటి కేసులు నమోదు కాలేదని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని పేర్కొంటూ, నిరంతర పర్యవేక్షణ కోసం రాపిడ్ రెస్పాన్స్ వైద్య బృందాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

గొల్లగుప్ప గ్రామంలో డీఎంహెచ్ఓ డా. పి. సరిత ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య బృందాలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి 6 మంది, కాకినాడ నుంచి 9 మంది, విజయవాడ నుంచి 4 మంది, ఏలూరు నుంచి 5 మంది వైద్యులు రాపిడ్ రెస్పాన్స్ బృందాల్లో సేవలందిస్తున్నట్లు వివరించారు.

గ్రామంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర కేస్ స్టడీ నిర్వహించి వ్యక్తిగత ఆరోగ్య రికార్డులను రూపొందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్య చరిత్ర, గతంలో ఎదుర్కొన్న అనారోగ్య సమస్యలు, ప్రస్తుతం కనిపిస్తున్న లక్షణాలు తదితర వివరాలను వైద్య సిబ్బంది నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ విధంగా గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించి అవసరమైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**52 మందిలో 32 మంది డిశ్చార్జ్**

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 52 మందిలో ఇప్పటికే 32 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని కలెక్టర్ తెలిపారు. మరో 11 మందిని కొద్దిసేపట్లో డిశ్చార్జ్ చేసేందుకు వైద్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 9 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితి కూడా స్థిరంగా ఉందని వెల్లడించారు.

భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి డీసీహెచ్ఎస్ డా. సాంబశివరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో వైద్య సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైన అన్ని వైద్య సేవలు అందుబాటులో ఉంచామని కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు అందజేసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

# ప్రజల గుండెల్లో బతికే ఉన్న నాయకుడు వైయస్సార్...



-కూనవరంలో 17వ వర్ధంతి ఘనంగా

**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 2.** అపర భగీరథుడు,ప్రజల గుండెల్లో బ్రతికే ఉన్నా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి ని కూనవరం మండలంలో వైయస్సార్ పార్టీ నాయకులు శ్రేణులు సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు.మంగళవారం కూనవరం కేంద్రంలోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం స్థానిక గవర్నమెంట్ ఆస్పత్రిలోని పేషెంట్లకు బ్రెడ్,పళ్ళు పంపిణీ చేసి వైయస్సార్ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి వైయస్సార్ సిపి మండల అధ్యక్షులు ఆలూరి కోటేశ్వరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల మరియదాసు, రాష్ట్ర మాజీ డైరెక్టర్లు అరవ వెంకటరామారావు,దీకొండ గంగాధర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్,రైతు రుణమాఫీ లాంటి పథకాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వైయస్సార్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కూనవరం ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి,మాజీ సర్పంచులు కారం పార్వతి,తెల్లం నిరోషా,వైస్సార్సీపీ మండల మహిళా అధ్యక్షురాలు కొమ్మాని సునీత,మండల యూత్ అధ్యక్షుడు సోదే పాపారావు, నోముల కొండలరావు,సీనియర్ నాయకులు ఎస్ కె వహీద్, చామంతుల వెంకన్న,నందికొండ సత్యనారాయణ,జనరల్ సెక్రటరీ కుడియం మోహన్,టౌన్ ప్రెసిడెంట్ కొమ్మని మోహన్ రావు,కార్యకర్తలు, వైస్సార్ అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.

# గంగవరంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**భారీ ర్యాలీలు, కేక్ కటింగ్‌తో జనసేన శ్రేణుల సంబరాలు**

**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 2:** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను గంగవరం మండల కేంద్రంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల జనసేన నాయకుడు కుంజం సిద్ధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.

ఉదయం రంపచోడవరంలో నిర్వహించిన భారీ ర్యాలీలో గంగవరం మండలానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో కొత్త గంగవరం, పాత గంగవరం గ్రామాల మీదుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం వై జంక్షన్ వద్ద భారీ కేక్‌ను కట్ చేసి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన నియోజకవర్గ నాయకురాలు విశాలాక్షి కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల జనసేన ఉపాధ్యక్షుడు విష్ణు, మండల నాయకులు గవర్ రాజు, గణేష్ కృష్ణ, రాహుల్, సాయి, జనసేన వీర మహిళలు పావని, సునీల్, అరవింద్, సత్తి, కుంజం బాలు, శ్రీను, నాని తదితరులు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించటమే పవన్ లక్ష్యం : ఎమ్మెల్యే బొలిశెట్టి





**తాడేపల్లిగూడెం,పెన్ పవర్. సెప్టెంబర్ 2:**యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పించటమే జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద చత్రపతి శివాజీ సెంటర్లో బుధవారం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి తాడేపల్లిగూడెం పట్టణం,వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అభిమానుల కోలాహలం మధ్య బర్త్ డే కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని అన్నారు. జనసేన పార్టీ కోసం 2019 నుంచి 2024 వరకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ పనిచేసిన యువకుల కృషి అభినందనీయమని పేర్కొన్నారు.పార్టీ కోసం గత రెండున్నర సంవత్సరాలుగా కష్టపడుతున్న యువకులను గుర్తించి వివిధ విభాగాల్లో అవకాశాలు కల్పించామని అన్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా యువత, విద్యార్థులను రాజకీయాల్లోకి ఆహ్వానించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

విద్యార్హతలు, ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలపై అవగాహన లేని కొంతమంది రాజకీయ నాయకులుగా ఎన్నికవుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ వంటి పరీక్షల గురించి కూడా తెలియని వ్యక్తులను ఎన్నుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత వైసిపి పాలనలో ఎదుర్కొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజలు ఆలోచించాలన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయకుండా పథకాలను పంచిపెట్టడానికే పరిమితమయ్యారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై స్పందించి, అవసరమైన సమయంలో బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కార్యకర్తలకు సూచించారు.

పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను 24వ స్థానం నుంచి మొదటి స్థానానికి తీసుకువచ్చేందుకు కృషి జరిగిందన్నారు. సుమారు రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు దాదాపు 7,000 నుంచి 8,000 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ కార్యక్రమాల్లో ప్రజలు, మీడియా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.ప్రధాని మోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తొలుత విశ్రాంత సైనిక ఉద్యోగులను సత్కరించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, వాడపల్లి సుబ్బరాజు, బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఘనంగా జనసేన యువజన విభాగం ఆవిష్కరణ







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 02.**జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో జనసేన యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించరు. ఈ కార్యక్రమం తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే ఉ ప్రభుత్వ విప్ శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించరు.ఈ కార్యక్రమానికి ఎన్‌డీఏ కూటమి నాయకులు, జనసేన పార్టీ జిల్లా, టౌన్, మండల, గ్రామీణ ప్రాంతాల నాయకులు, గ్రామ నాయకులు, జనసేన యువజన విభాగ నాయకులు, మహిళా నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు, వివిధ సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా యువతను ప్రజాసేవలో ముందుండి పనిచేయాలని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువశక్తే జనసేనకు వెన్నెముక అని, యువత భాగస్వామ్యంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 2;** పవన్ కళ్యాణ్ ఆశయాలు, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి జన సైనికుడు కృషి చేయాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. బుధవారం జనసేన అధినేత ,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి భారీ బైక్ ర్యాలీతో జీలుగుమిల్లి నుండి దర్భ గూడెం, లక్ష్మీపురం మీదుగా టీ నర్సాపురం వెళ్లారు. శ్రీ జగదాంబ అమ్మవారి సెంటర్లో కేక్ కట్ చేసి జనసేన నాయకుడు మేకల మంగరాజుకు ఎమ్మెల్యే తినిపించారు. దర్భ గూడెం గ్రామంలో బస్సు షెల్టర్ ను ప్రారంభించి ,లక్ష్మీపురం గ్రామంలో జనసేన పార్టీ స్థూపాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షు లు సుంకవల్లి సాయి, జనసేన మండల నాయకులు బండారు అనిల్, పద్దం వెంకటకృష్ణ ,కుంజ రమేష్, దేవుడు శ్రీను, మద్దాల రమేష్, తొమ్మిదేళ్ల దుర్గాప్రసాద్ ,రాయి సుబ్బారావు, సాయి, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది

- రాష్ట్రంలో వ్యవసాయ రంగం రూపురేఖలు మార్చిన మహనీయుడు వైఎస్సార్
- వడ్డి రఘురామ్ నాయుడు





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 02.**డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ నాయుడు పోలీస్ ఐ ల్యాండ్ సెంటర్లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారికి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం పడాల మార్కెట్ యార్డ్ లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కృష్ణ, గోదావరి జలాలతో జలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ మాట్లాడుతూ దివంగత మహానేత, మన ప్రియతమ నాయకులు, డా వైయస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక చారిత్రాత్మక కార్యక్రమాలను చేపట్టి, ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. రైతన్నల సంక్షేమం కోసం సాగునీరు -- ప్రజల కోసం త్రాగునీరు అందించాలనే మహోన్నత లక్ష్యంతో డా॥ వైయస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. రాష్ట్రంలో అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టి, రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి రంగంలో మార్పుకు అడుగులు వేశారన్నారు. డా॥ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా నిర్మించిన ప్రారంభించిన నీటిపారుదల ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు తదితర జలవనరుల మహానేత చేసిన సేవలను, రైతులు -- పేదలు -- బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యంగా జలయజ్ఞం ద్వారా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల జలయజ్ఞం కాలంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బ్యారేజీలు, రిజర్వాయర్లు, కాలువలు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు, నీటిపారుదల ప్రాజెక్టులు చేపట్టబడ్డాయన్నారు. రైతులకు కరెంట్ బిల్లులు మాఫీ, ఉచిత విద్యుత్తు పథకాలతో వ్యవసాయాన్ని పండగ చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకంతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారన్నారు. ఫీజు రియంబర్స్మెంట్తో పేద పిల్లలకు ఉన్నత చదువులు దగ్గర చేశారన్నారు. అటువంటి కారణజన్ముడు వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి తనయుడైన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తండ్రిని మించిన తనయుడుగా ప్రజల మెచ్చిన పాలనఅందించినారు అన్నారు.. వాలంటీరు, సచివాలయం, వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు..

ఈ భూమి ఉన్నంతకాలం, సూర్యచంద్రులు ఉన్నంతకాలం వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. 2029ఎన్నికల్లో మరోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ డంకా మోగిస్తుందని, వైయస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని వడ్డి రఘురామ్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్చార్జులు, వివిధ హోదా నాయకులు, కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# పోలవరం కుడి కాలువ జలాలతో వైఎస్సార్ విగ్రహానికి జలాభిషేకం



**పెన్ పవర్ -- ఉంగుటూరు । సెప్టెంబర్ 02** ఉంగుటూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం గొల్లగూడెంలో ఆయన విగ్రహానికి పోలవరం కుడి కాలువ నీటితో జలాభిషేకం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహానేత సంకల్పంతో సాకారమైన పోలవరం కుడి కాలువ జలాలతో ప్రత్యేకంగా జలాభిషేకం చేశారు.

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ.. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ఆశయాలు, అభివృద్ధి అడుగుజాడలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. రైతు సంక్షేమం కోసం ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి కార్యక్రమాలను అమలు చేసి అన్నదాతకు అండగా నిలిచారని కొనియాడారు. పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తుచేశారు.

వైఎస్సార్ జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసి రైతుల జీవితాల్లో వెలుగులు నింపారని వాసుబాబు పేర్కొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మంగారావు, జడ్పీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, ఎంపీపీ శ్రీలక్ష్మి, నాయకులు నాగు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



**పెన్ పవర్ -- ఉంగుటూరు । సెప్టెంబర్ 02** ఉంగుటూరు: డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఉంగుటూరు నియోజకవర్గంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో యువజన విభాగం ఏర్పాటు, కేక్ కటింగ్ కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించారు.

భారీ మోటార్‌సైకిల్ ర్యాలీతో నారాయణపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వేలాది మంది జనసేన కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కేక్ కట్ చేసి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

కార్యక్రమంలో ఉంగుటూరు ఏఎంసీ చైర్మన్ కరేటి జ్యోతి, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వి.బి.జి. రామ్‌జీ సిబ్బందితో ఎంపీడీవో సమీక్ష



**పెన్ పవర్ -- ఉంగుటూరు । సెప్టెంబర్ 02** ఉంగుటూరు: ఇటీవల ఉపాధి హామీ పథకం పేరు వి.బి.జి. రామ్‌జీగా మారిన నేపథ్యంలో పథకం సిబ్బందితో ఉంగుటూరు ఎంపీడీవో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో పథకం అమలు, కొత్త పనుల గుర్తింపు, రోజువారీ పని దినాల సంఖ్య పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు.

ఈ ఏడాది ఉంగుటూరు మండలానికి 50 పశువుల పాకలు/షెడ్లు మంజూరైనట్లు ఎంపీడీవో తెలిపారు. రెండు నుంచి ఆరు పశువులు కలిగి, సొంత స్థలం ఉన్న అర్హులైన చిన్న, సన్నకారు రైతులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

త్వరలో నిర్వహించనున్న సామాజిక తనిఖీకి ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించిన ఫైళ్లను ఆడిట్‌కు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని, ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ.6 వేల చొప్పున ఖర్చు కింద అందజేస్తామని తెలిపారు.

అదేవిధంగా భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నందున రైతులను ఫారం పాండ్ల నిర్మాణానికి ప్రోత్సహించాలని, తద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని భూగర్భ జలాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## వైసిపి కార్యాయంలో ఘనంగా వైఎస్ ఆర్ వర్ధంతి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా అన్ని కుటుంబాలకు మేలు చేకూర్చిన ఘనత వైఎస్ఆర్‌కే దక్కుతుందని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ కొనియాడారు. వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక విఎల్ పురం వైసిపి సిటీ కార్యాలయంలో భరత్ రామ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి భరత్‌తో పాటు వై సి పి నేతలు రౌతు సూర్య ప్రకాశరావు, మార్గాని నాగేశ్వరరావు, చందన నాగేశ్వర్, వైసిపి వివిధ విభాగాల నాయకులు, మాజీ కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన జగన్మో హన్ రెడ్డి ద్వారానే ప్రతి పేదవాడికి మేలు చేకూరుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు వైసిపికి మద్ధతుగా నిలవాలని కోరారు.

అనంతరం నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్రెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో మాజీ ఎంపీ మార్గాన్ని భరత్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక కొబ్బరికాయల మార్కెట్ వద్ద వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అక్కడ నుంచి స్థానిక మోరంపూడి జంక్షన్ లో యువజన విభాగం ప్రధాన కార్యదర్శి అరె చిన్ని ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహానికి, ఆ తర్వాత కోట గుమ్మం వద్దనున్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, వార్డు ఇంచార్జీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను మరువలేరు



నెల్లిపూడిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు



**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గంగవరం మండల అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను స్మరించుకున్నారు.

కార్యక్రమంలో భాగంగా ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదల సంక్షేమం, రైతుల అభివృద్ధి, విద్య, వైద్యం తదితర రంగాల్లో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో వైఎస్సార్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కె. గంగాదేవి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాతపూడి ప్రకాష్, కో-ఆప్షన్ సభ్యుడు కె.ఎస్. ప్రభాకర్, జిల్లా కార్యదర్శి ఏడుకొండలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు ఈపీ సతీష్, మాజీ సర్పంచులు శివ, కామరాజు, మాజీ ఉపసర్పంచ్ దుమ్ముల రమణ, సొసైటీ మాజీ డైరెక్టర్ పిర్ల నాగేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు సన్నుమల్ల యేసు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబ్జీ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ఇది ఇలా ఉండగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమం గంగవరం మండలం వేములోవ గ్రామంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యెజ్జు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వహించరూ మిర్తివాడ సంజీవ్ రెడ్డి మాజీ ఎంపిటిసి చలుమర్తి భూదేవి వైస్ ప్రెసిడెంట్ మిర్తివాడ రమణ విగ్రహానికి పూలమాలు వేసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు . భారీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైయస్సార్ అభిమానులు పాల్గొన్నారు

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## బాలికా సదనం, స్టేట్ హోమ్‌లను పరిశీలించిన డిఎల్ఎస్ఎ కార్యదర్శి వై శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 2:** తూర్పుగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి బుధవారం ప్రభుత్వ బాలికా సదనాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో సౌకర్యాలు, ఆహారం తదితర అంశాలపై విద్యార్థినుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకుని మంచి భవిష్యత్తును నిర్మించు కోవాలని శ్రీలక్ష్మి సూచించారు. క్రమశిక్షణ, సహనశీలత అలవరచుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

బాలికలకు మంచి స్పర్శ--చెడు స్పర్శ, బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించే పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. అనుమానాస్పద పరిస్థితులు, ఇబ్బందులను భయపడకుండా అధికారులకు తెలియజేయాలని సూచించారు.

వసతి గృహంలో సమస్యలు ఉన్నా, న్యాయపరమైన సహాయం అవసరమైనా 15100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ను సంప్రదించవచ్చని తెలిపారు. అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి సమస్యలను తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల సమీపంలోని కేవీ స్టేట్ హోమ్‌ను కూడా సందర్శించి వసతులను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి బాగోగులు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.

## జనసేన ఆద్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ, బైక్ ర్యాలీ



**రాజమహేంద్రవరం పెన్, పవర్, సెప్టెంబర్ 2:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన ఈ సందర్భంగా జనసేన నగర అధ్యక్షులు వై. శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళ్యాణ్ వేడుకలను బుధవారం స్థానిక ప్రియాంక గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా స్థానిక కంబాల చెరువు వద్ద నుంచి దేవి చౌక్, జాంపేట మీదుగా ప్రియాంక గార్డెన్స్ వరకు జనసేన నాయకులు, వీర మహిళలు, పార్టీ కార్యకర్తలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రియాంక గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వై. శ్రీనివాస్, నగర కాపు సంఘ నాయకులు రామినీడి మురళి తదితర నాయకులు కేక్ కట్ చేసి, పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా వై. శ్రీనివాస్ మాట్లాడుతూ, జనసేన పార్టీ నూతనంగా ఏర్పాటు చేసిన యువజన విభాగం పార్టీని బలోపేతం చేస్తుందని అన్నారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తున్న పవన్ కళ్యాణ్‌కు ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్ర ప్రగతికి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి నీ ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. ప్రజా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. యువతను రాజకీయాల్లో క్రియాశీలకంగా భాగస్వాములను చేయడంలో జనసేన పార్టీ దృష్టి సారిస్తోందని, జనసేన యువజన విభాగం ద్వారా యువతను ప్రజా సేవ, రాష్ట్ర రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించేలా పవన్ కళ్యాణ్ ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. మహిళలకు పార్టీలో ప్రత్యేక గుర్తింపు కల్పిస్తూ, ఉన్నత సమాజ నిర్మాణం కోసం పార్టీలో పనిచేస్తున్న వీర మహిళలుగా గౌరవించడం కూడా పవన్ కళ్యాణ్ ప్రత్యేకత అన్నారు.

జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు జామి సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పడాల శ్రీనివాసు, షేక్ భాషా లిమ్రా, తేజ మూర్తుల నరసింహమూర్తి, పైడిరాజు, అక్కిరెడ్డి ప్రసాదు, విజయలక్ష్మి, గురునాథరావు, అలివేలు బొలిశెట్టి ముమ్మడి వీరబాబు ,ముమ్మిడి లక్ష్మి, వీర మహిళలు, యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డైట్ విద్యార్థులకు అక్షరాస్యతపై అవగాహన






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న అక్షరాస్యత వారోత్సవాలను డైట్ కళాశాల విద్యార్థులకు అక్షరాస్యత, నిరక్షరాస్యత నిర్మూలన, వయోజన విద్య ప్రాధాన్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

బుధవారం డైట్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సాయి రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి పి. పోసయ్య, తూర్పు గోదావరి అక్షర ఆంధ్ర సూపర్‌వైజర్ వేమగిరి మహల పాల్గొని విద్యార్థులకు అక్షరాస్యత లక్ష్యాలు, ప్రాధాన్యత, సమాజంలో ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాల్సిన అవసరాన్ని వివరించారు.

వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ద డంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత సమాజంలోని ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని వక్తలు తెలిపారు. అక్షరాస్యత వ్యక్తిగత అభివృద్ధితో పాటు కుటుంబ, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. అక్షర ఆంధ్ర లో నిరక్షరాస్యులను గుర్తించి వారికి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం, దైనందిన జీవితానికి అవసరమైన అవగాహన కల్పించేందుకు చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. ఏడాది నిర్వహించనున్న అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 100 గంటల బోధన కార్యక్రమంలో పాల్గొనేందుకు డైట్ ఛాత్రోపాధ్యాయులు ఉత్సాహం వ్యక్తం చేశారు. 2027 సెప్టెంబరు నాటికి ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ఉపాధ్యాయులు శ్రీమతి చూడామణి, లెక్చరర్ ఎం.డి. జిలానీ భాష, సీనియర్ లెక్చరర్, డాక్టర్ రాజా రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్‌తో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కీ:శే:మాజీముఖ్యమంత్రి వై.యస్.17వ.వర్ధంతి



-వై.యస్.ఆర్.సిపి.మండలకమిటీనాయకులు

**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.2**

మండలం లోనిరేఖపల్లి,దివంగతమా జీముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి, విగ్రహానికి,బుధవారంవై.యస్. ఆర్.సిపిమండలకమిటీనాయకులుపూలమాలలు వేసిఘనంగా17వ.వర్ధంతిని,నిర్వహించడంజరిగి ంది. అనంతరంచింతరేవుపల్లి, రామవరం, సోములగూడెం, చొప్పల్లి,తదితర, గ్రామాలోనివై.సి.పి.నాయకులుకార్య కర్తలు,బుధవారంసమావేశంలో పాల్గొని,మాట్లాడారు. ఈసందర్భంగా వై.సి.పి.పార్టీ,మండలకన్వీనర్,మాది రెడ్డిసత్తి బాబు,మాజీ సర్పంచ్,పిట్టా రామారావు,ఆర్. టి.ఐ.విభా గంజిల్లాఅధ్యక్షులు, బొడ్డుసత్యనారాయణ, మాట్లాడుతూదివంగత మాజీముఖ్య మంత్రి,వై.యస్. రాజశేఖర్,రెడ్డి, హయాంలో బడుగుబలహీనవర్గాలప్ర జలకోసం,ఆరోగ్యశ్రీ అనేక సంక్షేమపథకాలు,ప్రవేశ పెట్టిన,ఘనత,వై.యస్. రాజశేఖర్,రెడ్డి,అంటూకొని యాడారు.వై.యస్.రాజ శేఖరరెడ్డి,అడుగు జాడల్లో వారితనయుడు వై.యస్.జగన్ మోహన్,రెడ్డి,నడు స్తున్నారని, రాష్ట్రంలో మధ్యతరగతి,కుటుంబాలప్రజ లకు,న్యాయంజగాలంటే,మళ్ళీవై.యస్.ఆర్.సిపి, పార్టీ అధికారంలోకి, రావాలని,ప్రజలందరూకృషి,చేయాలని, కోరారు.ఈకార్య క్రమంలోజిల్లాఅధికార ప్రతినిధి,మాజీ మండల కన్వీనర్ వైస్,మండల పెసిడెంట్,ఉఎంపీటీసీ సభ్యులుఅనుబంధసంఘాలఅధ్యక్షులు,మండలనా య కులుకార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

# క్లోరోక్విన్ బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



* వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి
* మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

**గంగవరం/ రంపచోడవరం/ ఎటపాక, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** క్లోరోక్విన్ మాత్రలు తీసుకుని అస్వస్థతకు గురైన బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి వైద్య సిబ్బందిని ఆదేశించారు. వైద్య సేవల అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు.

ఎటపాక మండలం విస్సాపురం పంచాయతీ పరిధిలోని గుల్లగుప్ప గ్రామంలో బుధవారం మండల పార్టీ అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మలేరియాతో మృతి చెందిన విద్యార్థిని మడవి జమున (7) కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ విషయంపై వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే, మృతురాలి కుటుంబానికి అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**క్లోరోక్విన్ మాత్రల పంపిణీపై ఆరా**

గుల్లగుప్ప గ్రామంలో ఎంతమందికి క్లోరోక్విన్ మాత్రలు అందించారనే వివరాలను ఎమ్మెల్యే వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 40 మంది పెద్దలకు, 30 మంది చిన్నారులకు మాత్రలు అందించినట్లు సిబ్బంది తెలిపారు.

అనంతరం క్లోరోక్విన్ మాత్రలు తీసుకుని అస్వస్థతకు గురై భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన అన్ని చికిత్సా చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు.

ఆసుపత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం, బాధితుల్లో ఆరుగురికి మలేరియా సోకినట్లు నిర్ధారణ కాగా, మిగిలిన వారికి ఎలాంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. ఆరోగ్యం మెరుగుపడిన కొందరిని డిశ్చార్జ్ చేసినట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.

**బాధితులకు మనోధైర్యం**

క్లోరోక్విన్ బాధితులు ఎలాంటి అధైర్యానికి గురికావద్దని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అందరికీ అవసరమైన వైద్యసేవలు అందుతున్నాయని, ప్రభుత్వం, కూటమి నాయకత్వం బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇంకా ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశామని తెలిపారు.

**గుల్లగుప్పలో ప్రత్యేక వైద్య శిబిరాలు**

గుల్లగుప్ప గ్రామంలో ప్రజలకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, నిరంతరం ఆరోగ్య సేవలు అందించాలని ఎమ్మెల్యే వైద్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపర్చాలని, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు.

కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిశుభ్రతను కూడా పాటించాలని గ్రామస్తులకు సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చిన్నపాటి అనారోగ్య సమస్యలు కనిపించినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లుతూ పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని వైద్య, పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తూ వారిని ఆరోగ్యంపై చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఎటపాక మండల పార్టీ అధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, సొసైటీ అధ్యక్షుడు మాచినేని రాజేష్, కూనవరం మండల పార్టీ అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు, ఎటపాక మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దొంతు మంగేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ వల్లభనేని చందు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కణితి మధుబాబు, తెలుగు యువత అధ్యక్షుడు పాటి సంపత్, ఐటీడీపీ అధ్యక్షుడు బాచినేని శ్రీకాంత్, నలజాల శ్రీకాంత్, ఎంపీటీసీ పాయం దేవి, మాజీ ఎంపీపీ శ్యామల, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పుట్టి రమేష్, గార్లపాటి శ్రీనివాస్, తెలుగు యువత మహిళా అధ్యక్షురాలు లక్ష్మీరూప, చేకూరి కృష్ణయ్య, చేకూరి సత్యనారాయణ, గుమ్మడి నరసింహారావు, నలజాల మధు, బానోతు అశోక్, యూనిట్ ఇంచార్జ్ పాలడుగు నవీన్, గట్టి ప్రసాద్, గార్లపాటి శేఖర్‌తో పాటు అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి



* ఐదు రోజుల పాటు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు
* పోలవరం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయాజ్ భాష

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 2:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు, డిమాండ్ల పరిష్కారం కోసం రెవెన్యూ ఉద్యోగులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఐక్యంగా ముందుకు రావాలని పోలవరం జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ఫయాజ్ భాష పిలుపునిచ్చారు.

ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫయాజ్ భాష తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుల సూచనల మేరకు ఉద్యోగుల సమస్యలు, డిమాండ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వివిధ రకాల డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యోగులు తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తారని తెలిపారు.

పోలవరం జిల్లాలోని ప్రతి రెవెన్యూ కార్యాలయంలో ఈ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చిహ్నంగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్లడంతో పాటు, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని అన్నారు.

రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు, ఏపీ జేఏసీ అమరావతి నుంచి తదుపరి ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన సూచనలు అందిన వెంటనే వాటిని అమలు చేస్తూ తదుపరి చర్యలు చేపడతామని ఫయాజ్ భాష తెలిపారు.

ఈ కార్యక్రమంలో హడక్ కమిటీ సభ్యులు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌కు ఘనంగా నివాళులు







**చింతూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 2:** దివంగత ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం చింతూరు మండల వైఎస్సార్‌సీపీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు చింతూరు మండల కేంద్రంలో భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చింతూరు మెయిన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజా సంక్షేమ పాలన నేటికీ ప్రజల మనసుల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ జిక్రియా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎగుమంటి రామలింగారెడ్డి, మాజీ సర్పంచులు ఆకేటి సీత, పాయం చంద్రయ్య, సవలం సత్తిబాబు, ముచ్చిక నాగార్జున, కారం కన్నారావు, ఖాదర్ షరీఫ్, అమీర్ షహిన్షా, శ్యామల విజయరెడ్డి, కాక సీతారామయ్య, భూక్యా బాబూరావు, కోటం జయరాజు, సవలం దారయ్య, మడకం లక్ష్మయ్య, పండా నాగరాజు, రవ్వా రాజయ్య, బొక్కిలి రామారావు, సవలం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, రిక్షా కార్మికులకు జట్టు కార్మికులకు బట్టలు పంపిణీ





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 02.** తాడేపల్లిగూడెం పట్టణంలో స్థానిక రేలంగి చిత్ర మందిర్ సెంటర్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ మరియు రిక్షా కార్మికులకు జట్టు కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేసి రిక్షా కార్మికులకు ఆయన చేతులమీదుగా బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకొని ఆ విశ్వదుర్గేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని అలాగే ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొడ్డు సాయిబాబా, కొవ్వూరి నాగేంద్ర రెడ్డి, సూరిబాబు, మాజీ కౌన్సిలర్ కొల్లి రమావతి, పైపోయిన వెంకట రామయ్య, పపోప్పుల త్రినాథ్, యంత్రపాటి రాజు,బోజంకి శ్రీనివాస్, ప్రసాద్, సూరి మరియు గొర్రెల శ్రీధర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# అన్నదేవరపేటలో ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** జనసేన పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను అన్నదేవరపేట గ్రామంలో జనసేన నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు చెవ్వూరి బంగార్రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు అల్లూరి విక్రమాదిత్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెలుగుబంటి బాలకృష్ణ, కవల రామాంజనేయులు, చెవ్వూరి రాము, రేగడామిల్లి పండు, గర్భాపు శేఖర్ తదితర జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చింతూరు మండల కేంద్రంలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**చింతూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని చింతూరు మండల కేంద్రంలో జనసేన పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. చింతూరు నడిసెంటర్‌లో కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్ కి జనసేన నాయకులు, వీర మహిళలు, జనసైనికులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చింతూరు మండల కమిటీ నాయకులు తీగల కవిత, పయ్యాల నాగేశ్వరరావు, బేడే సతీష్ మాట్లాడుతూ. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత పదవులు, ప్రయోజనాలను ఆశించకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, అంచెలంచెలుగా జనసేన పార్టీని బలోపేతం చేసి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, యువతలో సేవా స్ఫూర్తిని నింపిన ప్రజానాయకుడు పవన్ కళ్యాణ్ ని అన్నారు. సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆయనకు ఆయురారోగ్యాలు, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలగాలని, రాష్ట్ర ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు, సీనియర్ నాయకులు, వీర మహిళలు, జనసైనికులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 17 వర్ధంతి





**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 02:** పేద ప్రజలకు ఆరోగ్యం, విద్య అందుబాటులోకి తీసుకువచ్చిన మహా నాయకుడు రాజశేఖరరెడ్డి అని పి గన్నవరం నియోజకవర్గ కో.ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావుఅన్నారు.

దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి 17 వర్ధంతి ని స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సిఈసి సభ్యులు పి.కె..రావు, ఎస్ఈసి సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు, జడ్పిటిసి బూడిద వరలక్ష్మి, నాయకులు ఎంఎం శెట్టి, కొర్లపాటి కోటబాబు వాసంశెట్టి తాతాజీ, సూదబత్తుల రాము, మైలా ఆనందరావు, బుడితి సత్యనారాయణమ్మ, కాండ్రేగుల గోపాలకృష్ణ, నేదునూరు యేసు, మట్టపర్తి హరి, చిల్లి ధనరాజ్, చప్పిడి పండు, వాసంశెట్టి వెంకన్న, దొమ్మేటి శ్రీను, మట్టపర్తి యాజ్ఞశ్రీ వెంకటేశ్వరరావు, గోసంగి కుమార్ స్వామి, రాయుడు మీరా సాహెబ్, కుసుమే శ్రీనివాస్, కోట సత్తిబాబు, అత్తిలి లోకేష్, చిల్లి శ్రీనివాస్, పాలమూరు బాలకృష్ణ, ఇసుక పట్ల శ్రీనివాస్, పోలమూరు బాలరాజు చౌదరి తదితరులు పాల్గొన్నారు..

## ఈనెల 9న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 02:**రైతులకు పట్టాదారు పాసు బుక్స్ పంపిణీ చేసేందుకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశానికి అనువైన ప్రాంతాలను కొత్తపేట ఆర్డీవో జి.వి. వి. సత్యనారాయణ బుధవారం పరిలించారు. మండలంలోని అంబాజీపేట పండువారిపేట లో లేఅవుట్, కె.పెదపూడి ఓఎన్జీసి సైటు ప్రాంతాలలో సమావేశం ఏర్పాటు కు, ఇరుసుమండ, జయంతినగర్ సమీపంలో లేఅవుట్ లో హెలిపెడ్ ఏర్పాటు కు స్థల పరిశీలన చేసారు. ఈ పరిశీలనలో ఎంపీడీవో బి. మమత, పి.గన్నవరం నియోజవర్గ కో-కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, టిడిపి సీనియర్ నాయకులునాగాబత్తుల వెంకట సుబ్బారావు పెదపూడి శ్రీనివాసరావు, గుంటూరు మురళీకృష్ణ రాజు, నాగవరపు అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

## మండలంలోని హైస్కూల్ లను సందర్శించిన రాష్ట్ర ఎస్టీయు ప్రధాన కార్యదర్శి లంకలపల్లి సాయి




**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 02:**మండల పర్యటన సందర్భంగా మండలంలోని పలు హైస్కూల్ లను రాష్ట్ర ఎస్టియు ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య అధ్యక్షులు లంకలపల్లి సాయి శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. అనంతరం అంబాజీపేట హై స్కూల్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల బాధ్యతలు, టెట్, 2027 మార్చిలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల గురుంచి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సరిదే సత్య పల్లం రాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి కుడిపూడి హేమంత్ శివకుమార్, రాష్ట్ర కన్వీనర్ బోనం గంగాధర్, మండల శాఖ అధ్యక్షుడు కుంపట్ల వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎండిఎం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 11న విడుదలయ్యే ఎపిక్' సినిమాను విజయవంతం చేయాలి



నగరంలో సందడి చేసిన ఎపిక్' సినిమా హీరో, హీరోయిన్లు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 2:** ప్రతి వ్యక్తి జీవితంలో టచ్ అయ్యేవిధంగా ఆదిత్య స్టూడియో, ఫోర్టీన్ ఫోర్ బ్యానర్ పై నిర్మించిన రొమాంటిక్ లవ్ స్టోరీ ఈ నెల 11వ తేదీన విడుదల కానున్న 'ఎపిక్' సినిమాను విజయవంతం చేయాలని చిత్రం హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవి చైతన్య లు విజ్ఞప్తి చేశారు. చిత్రం ప్రమోషన్ లో భాగంగా వీరు బుధవారం నగరం లో సందడి చేశారు. స్థానికంగా జరిగిన మీడియా సమావేశంలో హీరో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ , ఒక వ్యక్తి జీవితంలో కుటుంబం, స్నేహితులు, ప్రేమ విషయల్లో ఎదురయ్యే చిన్న, చిన్న సంఘటనలతో మిలితమైన యూత్ ఫుల్ లవ్ స్టోరీ చిత్రం అన్నారు. కథ, డైరెక్షన్ను ఆదిత్య హాసన్ ఎంతో ప్రతిభావంతంగా చిత్రీకరించారని అన్నారు. ఖుషి , గర్ల్ ఫ్రెండ్ చిత్రాలకు అద్భుత సంగీతం అందించిన అబ్దుల్ వాహిద్ ఈ సినిమా కు అందమైన ట్యూన్స్ ఇచ్చారని యువతను ఆకట్టుకుంటా యన్నారు. తన తదుపరి చిత్రం తక్షకుడు, ఇండో కొరియన్ చిత్రాలు ఉన్నాయన్నారు. ఫస్ట్ సెమిస్టర్ విజయవంతం అయితే సెకండ్ సెమిస్టర్ ఉండొచ్చునన్నారు. హీరోయిన్ వైష్ణవి మాట్లాడుతూ, ఈ చిత్రంలోని నాలుగు పాటలు యువతీ యువకుల హృదయాలను ఆకట్టుకుంటాయన్నారు. ఈ సినిమా యూత్ ఫుల్ లవ్ స్టోరీ అని, ప్రతి వ్యక్తి జీవితంలోని సున్నితమైన కథనంతో నిర్మించిన సినిమ ను 11న థియేటర్లో చూడాలని కోరారు. ఇందులోని పాటలకు యువత లో మంచి స్పందన లభించింద న్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కూటమి ప్రభుత్వంపై మాజీ సర్పంచ్ రౌతు జోగేశ్వరరావు నిప్పులు

- రెండున్నరేళ్లయినా ఒక్క హామీ అమలు కాలేదు
- వైయస్సార్ ను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురైన జోగేశ్వరరావు.



గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 02:- గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి జోగేశ్వరరావు బుధవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు రెండున్నర సంవత్సరాలు దాటినా ఒక్కటీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.

కొండపోడు పట్టాల హామీ ఏమైంది..?

కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో గిరిజనులు, ఎస్సీలు కొండపోడు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వారికి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ హామీని పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు.

మహిళలకు రూ.15 వేలు ఏది?

ప్రతి మహిళకు అండగా ఉంటామని, భరోసాగా రూ.15,000 ఇస్తామన్న హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఆపథకం ఊసే లేకుండా పోయిందన్నారు.

తాగునీరు కూడా ఇవ్వలేరా?

గ్రామంలో మంచినీటి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితిలో పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఎవరైనా చనిపోతే పూడ్చేందుకు స్మశానానికి స్థలం కూడా చూపించలేని స్థితిలో రెండేళ్ల పాలన కొనసాగడం సిగ్గుచేటని అన్నారు.

రైతుకు యూరియా కూడా దొరకడం లేదు:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులకు కావలసినంతగా సుమారు 100 టన్నుల వరకు ఎరువులు సరఫరా చేశామని, నేడు రైతులకు ఒక్క కేజీ ఎరువు కూడా దొరకడం లేదని ఆరోపించారు. ఎల్ నినో ప్రభావంతో ఆలస్యంగా నాట్లు వేసిన వరి పంటకు కనీసం యూరియా చల్లేందుకు ఒక్క బస్తా కూడా ఇవ్వలేని ప్రభుత్వం ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. బయట మార్కెట్లో కొందామన్నా ఎరువులు దొరకడం లేదని, ఇదేనా రైతుల కోసం మీరు చేస్తున్నదని నిలదీశారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ ఏమైంది.?

సంవత్సరానికి మూడు వంట గ్యాస్ సిలిండర్ లు మహిళలకు ఇస్తానని చెప్పి మాట మార్చారని ఇదేనా మీరు సూపర్ సిక్స్ అని ఇది మరోసారి మహిళలను మోసం చేయడమేనని ఆయన ఘాటుగా విమర్శించారు. రెండు సంవత్సరాల విజయోత్సవ యాత్రలు చేస్తున్నారా ప్రజలకు ఇచ్చిన హామీ ఏంటి మీరు చేస్తున్నది ఏంటి ? ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ప్రతి ఒక్కటి ప్రజలు గమనిస్తున్నారని తప్పనిసరిగా 2029లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

మట్టి మాఫియాపై సీరియస్....

కృష్ణునిపాలెంలో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండున్నరేళ్లలో మట్టి మాఫియా రాజ్యమేలు తోందని, మైనింగ్ పై చూపించిన శ్రద్ధలో సగం కూడా ప్రజల కనీస అవసరాలపై చూపిస్తే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఘాటుగా విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వ అరాచక పాలనపై మరిన్ని ఆధారాలతో మరోసారి మీడియా ముందుకు వస్తానని ఆయన తెలిపారు.

ఆ మహానుభావుడు వైస్సార్ వల్లే రైతులు సంతోషంగా ఉన్నారు....

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యమాఅని ముసిరిమిల్లి ప్రాజెక్టు కట్టడం వల్లే ఈ ప్రాంతం కొంత సుభిక్షంగా ఉన్నదని కనీసం ఆ రైతులను ఆదుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేకుండా పోయిందని ఇలాంటి సందర్భం ఆ మహానుభావుడు చనిపోయిన రోజు పెట్టుకోవడం బాధాకరంగా ఉందని దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డిని స్మరించుకుంటూ ఓకింత భావోద్వేగానికి లోనయ్యారు.

ఈ సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ అంబటి అబ్రహం, బీసీ విభాగపు అధ్యక్షులు పొట్నూరి అచ్చారావు, వైఎస్ఆర్సిపి రైతు విభాగపు అధ్యక్షులు బోలకొండ నూక ప్రసాద్, సోషల్ మీడియా అధ్యక్షులు ధనుంజయ్, గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ సభ్యురాలు వైయస్సార్ సిపి జగ్గంపేట నియోజకవర్గం మహిళా కమిటీ అధ్యక్షురాలు తుర్రం సత్యవతి పోలూరు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు. తదితర మహిళా తదితర వైఎస్ఆర్సిపి సభ్యులు పాల్గొన్నారు.

## భూపతిపాలెంలో జాతీయస్థాయి విద్యాకేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు






**ఎడ్యుకేషనల్ హబ్ కు అత్యంత అనుకూలమన్న కంచిపీఠం ప్రతినిధుల**

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 2:-** గోకవరం మండలం భూపతిపాలెం రెసిడెన్షియల్ పాఠశాల పరిసరాల్లో ఐదు వందల ఎకరాల విశాల స్థలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత విద్యా కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం కంచి కామకోటి పీఠం నుండి బుధవారం పరిశీలకులుగా విచ్చేసిన విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త ప్రొఫెసర్ మూర్తి, శ్రీ చంద్ర శేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం సీఈఓ అరుణ్ సుబ్రహ్మణ్యం జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, రెసిడెన్షియల్ స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గళ్ళ రాము లతో కలిసి భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ ప్రాంతంలో పర్యటించి స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ప్రతినిధి బృందం మాట్లాడుతూ ఈ ప్రాంతం చక్కని ఆహ్లాదకరమైన వాతావరణంతో, పుష్కలంగా నీటి వసతితో, పక్కనే ఏలేరు నది ఉండడంతో విద్యా కేంద్రం ఏర్పాటుకు అత్యంత అనుకూలంగా ఉందని, ఇక్కడ విద్యా కేంద్రం ఏర్పాటు చేస్తే అద్భుతంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మొదట ఈ విద్యా కేంద్రం ఆలోచనను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లానని, ఇది చాలా బాగుందని ఆయన ప్రశంసించినప్పటికీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వెంటనే కార్యరూపం దాల్చడం కష్టమని తెలియజేశారని అన్నారు. ఆ తర్వాత తిరుపతిలో కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీని దర్శించుకున్న సందర్భంలో ఈ విషయాన్ని వారికి తెలియజేయగా, వారు కంచి వచ్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వమని తెలియజేయగా మేము వెళ్లి వారికి విషయాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేయడం వారికి ఎంతో నచ్చి వారి ఆలోచన కూడా ఆంధ్రాలో ట్రస్టు ద్వారా విశ్వవిద్యాలయం ఏర్పాటు చెయ్యాలని ఒక కమిటీని వేయడం జరిగింది అందులో భాగంగానే ఈరోజు ప్రతినిధులను వచ్చి స్థల పరిశీలన చేయడం జరిగిందని అన్నారు. ఈ విద్యా కేంద్రం ద్వారా ఈప్రాంత ప్రజలకు కేజీ నుండి పీజీ వరకు ఒకే చోట విద్యతో పాటు వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాలల ద్వారా వైద్య సేవలు అందుతాయని, ఇది కేవలం కళాశాలల నిర్మాణం మాత్రమే కాదు, తరతరాల భవిష్యత్తుకు వేసే పునాది అని, వేలాదిమంది ప్రత్యక్షంగా పరోక్షంగా జీవనోపాధి పొందుతారని ఈ ప్రాంతం రాష్ట్రంలోనే ఆదర్శ విద్యా కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. ఈ పర్యటనలో గోకవరం మండలం తెలుగుదేశం పార్టీ కన్వీనర్ పిల్ల అర్జున సారథి (చంటిబాబు) మారిశెట్టి భద్రం, ఉంగరాల గణేష్ వైస్ చైర్మన్ రాజీవ్, కమ్మిల వెంకటేశ్వరరావు, పాలాడి శ్రీను, చింత అరుణ్ కుమార్ శర్మ, నారీశక్తి సభ్యురాలు చెక్క మరియమ్మ, రాపాక లక్ష్మి,భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ కంచి మఠం ప్రతినిధులు, విద్యావేత్తలు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రోహిత్ అనుభవం, కోహ్లీ దూకుడు.. 2027 ప్రపంచకప్‌లో
# భారత జట్టుకు అవే బలం: జాంటీ రోడ్స్

- 2027 ప్రపంచకప్ కోసం రోహిత్ అనుభవం జట్టుకు ఎంతో అవసరమన్న రోడ్స్
- ప్రపంచకప్ లాంటి టోర్నీల్లో ప్రతిభ కన్నా మానసిక బలమే కీలకమని వ్యాఖ్య
- కోహ్లీ దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చిన దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజం
- కోహ్లీ ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్, అల్టిమేట్ ఫినిషర్ అని ప్రశంస
- కెప్టెన్‌గా ఉన్నా లేకున్నా, భారత్ గెలవాలనే కోహ్లీ తపన అమోఘమన్న రోడ్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ జట్టులో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాముఖ్యతను దక్షిణాఫ్రికా మాజీ క్రికెట్ దిగ్గజం జాంటీ రోడ్స్ నొక్కిచెప్పాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న తరుణంలో రోహిత్ శర్మ అపారమైన అనుభవం టీమిండియాకు ఒక భారీ ఆస్తి అని అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో విరాట్ కోహ్లీలోని గెలుపు తపన, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చి ప్రశంసలు కురిపించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ జాంటీ రోడ్స్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. "2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు ప్రణాళికలు రచిస్తున్నప్పుడు, రోహిత్ శర్మ లాంటి అనుభవజ్ఞుడైన ఆటగాడు జట్టులో ఉండటం అమూల్యమైనది. మనం తరచుగా ఆటగాళ్ల ప్రతిభ, వారి ప్రదర్శనల గురించే చర్చిస్తాం. కానీ, ప్రపంచకప్ లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన టోర్నీల్లో మానసిక బలం అనేది చాలా కీలకం. ఈ విషయాన్ని సెలక్షన్‌లో అంతగా పట్టించుకోం" అని రోడ్స్ పేర్కొన్నాడు. తాను నాలుగు ప్రపంచకప్‌లు ఆడినా రెండు సెమీఫైనల్స్ దాటలేకపోయానని, ఆ టోర్నీల్లో ఒత్తిడి ఏ స్థాయిలో ఉంటుందో తనకు బాగా తెలుసని గుర్తుచేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో రోహిత్ లాంటి ఆటగాడి అనుభవం జట్టుకు ఎంతో మేలు చేస్తుందని వివరించాడు. ఇప్పటివరకు 288 వన్డేల్లో 34 సెంచరీలు, 62 అర్ధ సెంచరీలతో దాదాపు 12 వేల పరుగులు చేసిన రోహిత్, 2019 ప్రపంచకప్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రోహిత్ గురించి మాట్లాడుతూనే, జాంటీ రోడ్స్ విరాట్ కోహ్లీపై కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీలోని గెలుపు కసిని, దూకుడును ఒకప్పటి ఆస్ట్రేలియా జట్టుతో పోల్చాడు. "ఒకప్పుడు ప్రపంచకప్‌లను ఆస్ట్రేలియా ఎలా శాసించిందో మనం చూశాం. గెలవాలనే వారి తపన, దూకుడు అమోఘం. సరిగ్గా అలాంటి గెలుపు ఆకలి విరాట్ కోహ్లీలో కనిపిస్తుంది. జట్టును గెలిపించాలనే సంకల్పం అతనిలో బలంగా ఉంటుంది" అని రోడ్స్ అన్నాడు. ప్రపంచంలోనే బెస్ట్ ఛేజర్‌గా, టీమిండియాకు అల్టిమేట్ ఫినిషర్‌గా కోహ్లీ నిలిచాడని కొనియాడాడు. "ఛేజింగ్‌లో కోహ్లీ స్థిరంగా రాణించడం, జట్టును విజయతీరాలకు చేర్చాలనే అతని పట్టుదలను తెలియజేస్తుంది. అతను పోటీని, పోరాటాన్ని ఇష్టపడతాడు. కెప్టెన్‌గా ఉన్నా లేకపోయినా, భారత్ గెలవాలనే అతని డ్రైవ్ మాత్రం మారదు" అని జాంటీ రోడ్స్ స్పష్టం చేశాడు. 314 వన్డేల్లో 54 సెంచరీలతో దాదాపు 15 వేల పరుగులు చేసిన కోహ్లీ గణాంకాలే అతని సత్తాను తెలియజేస్తాయని అన్నాడు.

# దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్..
# కెప్టెన్ ఇన్నింగ్స్‌తో గెలిపించిన తిలక్ వర్మ



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ 2026/27 సీజన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. నార్త్ జోన్‌తో జరిగిన సెమీ ఫైనల్లో కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతమైన కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఏడు వికెట్ల తేడాతో సునాయాస విజయాన్ని అందించి, టైటిల్ పోరుకు అర్హత సాధించేలా చేశాడు. సెప్టెంబర్ 6 నుంచి చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగే ఫైనల్లో ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్‌తో సౌత్ జోన్ తలపడనుంది. మ్యాచ్ చివరి రోజు 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్ జోన్‌కు కెప్టెన్ తిలక్ వర్మ (79 బంతుల్లో 51 నాటౌట్) అండగా నిలిచాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కీలకమైన సెంచరీ (116 నాటౌట్)తో జట్టును ఆదుకున్న తిలక్, రెండో ఇన్నింగ్స్‌లోనూ అదే బాధ్యతాయుతమైన ఆటతీరును ప్రదర్శించాడు. రవిచంద్రన్ స్మరణ్ (32 నాటౌట్)తో కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 80 పరుగులు జోడించి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అంతకుముందు నాలుగో రోజు ఆట ప్రారంభించిన నార్త్ జోన్ భారీ లక్ష్యాన్ని నిర్దేశించాలని భావించింది. అయితే, సౌత్ జోన్ పేసర్ ఎండీ నిధీశ్ వారి ప్రణాళికలను దెబ్బతీశాడు. వరుస విరామాల్లో వికెట్లు తీసి నార్త్ జోన్ పతనాన్ని శాసించాడు. చివరి మూడు వికెట్లను పడగొట్టి, ఇన్నింగ్స్‌లో మొత్తం 5 వికెట్లు (5/56) సాధించాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతనికి ఇది 10వ ఐదు వికెట్ల ప్రదర్శన. దీంతో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 297 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో సౌత్ జోన్‌కు ఓపెనర్ రికీ భుయ్ (42) దూకుడైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, లంచ్ విరామానికి ముందు, ఆ తర్వాత నార్త్ జోన్ స్పిన్నర్ అబిద్ ముస్తాక్ విజృంభించడంతో మ్యాచ్ కాస్త ఉత్కంఠగా మారింది. రికీ భుయ్‌ను గుర్నూర్ బ్రార్ ఔట్ చేయగా, షేక్ రషీద్, నారాయణ్ జగదీశన్ (43) వికెట్లను ముస్తాక్ పడగొట్టాడు. దీంతో సౌత్ జోన్ 102 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి ఒకింత కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తిలక్ వర్మ, గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ అయిన స్మరణ్ తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలిస్తుండటంతో స్పిన్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ, అవసరమైనప్పుడు వేగం పెంచుతూ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. గతేడాది ఫైనల్లో ఓటమిపాలైన సౌత్ జోన్, ఈసారి బలమైన ఆత్మవిశ్వాసంతో టైటిల్ పోరుకు సిద్ధమవుతోంది. మరో సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌ను ఓడించి ఈస్ట్ జోన్ ఫైనల్‌కు చేరుకుంది. విశేషమేమిటంటే.. 1970/71 సీజన్ తర్వాత దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్, ఈస్ట్ జోన్ తలపడటం ఇదే తొలిసారి.

# చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి లక్ష్య సేన్ ఔట్



**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ తీవ్రంగా నిరాశ పర్చాడు. టోర్నీ తొలి రౌండ్‌లోనే కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో తేడాతో ఓటమి పాలై ఇంటిబాట పట్టాడు. బుధవారం (సెప్టెంబర్ 2) షెన్?జెన్ వేదికగా జరిగిన ఈ పోరులో ప్రపంచ ర్యాంకింగ్‌లో తొమ్మిదో స్థానంలో విక్టర్ కేవలం 38 నిమిషాల్లోనే 14-21, 7-21 తేడాతో భారత షట్లర్?ను మట్టికరిపించాడు. భారత షట్లర్ లక్ష్య సేన్ 4-0 ఆధిక్యంతో గేమ్?ను ఘనంగా ఆరంభించాడు. కానీ చివరి వరకు ఆ ఊపును నిలబెట్టుకోలేకపోయాడు. విక్టర్ లాయ్ బలంగా తిరిగి పుంజుకున్నాడు. వ్యూహాత్మక డిఫెన్స్?తో భారత ఆటగాడిని ఒత్తిడిలోకి నెట్టాడు. దీంతో లక్ష్యసేన్ ర్యాలీలను ఛేదించడానికి ఇబ్బంది పడుతూ మరింత ఎక్కువగా రిస్క్ తీసుకోవడం ప్రారంభించాడు. సేన్ పదేపదే బ్యాక్‌హ్యాండ్ సైడ్‌లైన్ వైపు షాట్లు మిస్ చేస్తుండటంతో ఒత్తిడి మరింత తీవ్రమైంది. లాయ్ ఆ పొరపాట్లను తనకు అనుకూలంగా మలుచుకుని తొలి గేమ్‌ను 21-14 తేడాతో గెలుపొందాడు. తొలి రౌండ్ కోల్పోయిన లక్ష్య సేన్?కు రెండో రౌండ్?లో తిరిగి కోలుకునే అవకాశమే లేకుండా పోయింది. బలమైన అటాకింగ్, డిఫెన్స్ గేమ్?తో విక్టర్ లాయ్ పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. 4-11తో వెనకబడ్డ లక్ష్యసేన్ పాయింట్ల అంతరాన్ని పూడ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించాడు. ఈ క్రమంలో మరిన్ని అనవసర తప్పిదాలు చేసి తగిన మూల్యం చెల్లించుకున్నాడు. కెనడియన్ ఆటగాడు రెండో గేమ్‌ను 21-7 తేడాతో కైవసం చేసుకున్నాడు. దీంతో తొలి రౌండ్ లోనే భారత ఆటగాడు టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

# 'ఎపిక్' సబ్కో సాంగ్.. విదేశాల్లో స్టూడెంట్ లైఫ్ ఇలా..

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' నుంచి నాలుగో పాటగా 'సబ్కో' రిలీజ్ అయ్యింది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహించారు. ఇప్పటివరకు వచ్చిన పాటల్లో ప్రేమకు ఎక్కువ చోటు కనిపిస్తే, ఈసారి ఫ్రెండ్స్ గ్యాంగ్ వైపు వెళ్లారు. చదువు కోసం విదేశాలకు వెళ్లిన స్టూడెంట్స్ అక్కడ ఎలా ఉంటారు, వాళ్ల రోజువారీ లైఫ్ ఎలా మారుతుంది అనే విషయాలను పాటలో చూపించారు. లండన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ పాట సాగుతుంది. లండన్ ఐ, డబుల్ డెక్కర్ బస్సులు, అక్కడి వీధులు, బీచ్ లొకేషన్స్ హైలెట్ అయ్యాయి. కానీ కేవలం లొకేషన్స్ చూపించడంతో ఆగలేదు. పార్ట్ టైమ్ జాబ్స్ చేయడం, సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడం, రూమ్‌లో వంట చేసుకోవడం, అసైన్‌మెంట్స్‌తో కూర్చోవడం లాంటి స్టూడెంట్ లైఫ్ మూమెంట్స్ కూడా పెట్టారు. విదేశాల్లో చదివిన వాళ్లకు తెలిసిన చిన్న చిన్న విషయాలనే పాటలో ఎక్కువగా వాడారు. శ్రీ హర్ష ఇమాని రాసిన లిరిక్స్ కూడా అదే లైన్‌లో సాగుతాయి. "దేశం కాని దేశంలో" అంటూ ఇంటికి దూరంగా ఉన్న యువత పరిస్థితిని చెబుతూనే, కొత్త ఫ్రెండ్స్‌తో ఏర్పడే బంధాన్ని తీసుకొచ్చారు. అక్కడ ఎదురయ్యే కష్టాలను మాత్రమే కాకుండా, వాటి మధ్యలో వచ్చే సరదాను కూడా పాటలో కలిపారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించగా సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఈ పాటను పాడారు. ఆనంద్, వైష్ణవి మధ్య ట్రాక్ కూడా పాటలో పూర్తిగా పక్కన పెట్టలేదు. ఫ్రెండ్స్‌తో కలిసి పబ్‌కు వెళ్లడం, బయట తిరగడం, ఒకరితో ఒకరు టైమ్ గడపడం కనిపిస్తుంది. బోర్డ్ గేమ్ ఆడే సీన్, చిన్న రొమాంటిక్ మూమెంట్స్ కూడా ఉన్నాయి. అంటే ఇది పూర్తిగా ఫ్రెండ్‌షిప్ సాంగ్ కాకుండా, వాళ్లిద్దరి రిలేషన్ కూడా అదే గ్రూప్ లైఫ్ మధ్యలో ఎలా పెరుగుతుందో చూపించేలా పెట్టారు.







'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా ఇదే. కానీ ఈసారి వాళ్ల మధ్య కథ పూర్తిగా వేరే సెటప్‌లో ఉంది. ఆదిత్య హాసన్ '90ం ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' తర్వాత చేస్తున్న ఫీచర్ ఫిల్మ్ కావడంతో, మిడిల్ క్లాస్ యువత విదేశాలకు వెళ్లాక వచ్చే మరో జీవితాన్ని ఈ కథలో తీసుకున్నాడు. 'సబ్కో' పాటలో ఆ భాగం ఎక్కువగా బయటపడింది.

'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' సెప్టెంబర్ 11న థియేటర్లలోకి రానుంది. రిలీజ్‌కు పది రోజుల ముందు ఈ పాటను తీసుకొచ్చారు. ప్రస్తుతం చిత్ర బృందం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని కాలేజీల్లో ప్రమోషన్స్ చేస్తోంది. 'సబ్కో'ను కూడా స్టూడెంట్స్ మధ్య విడుదల చేశారు. ఇక సినిమా కంటెంట్ లేటెస్ట్ జనరేషన్ కు ఎంతవరకు కనెక్ట్ అవుతుందో చూడాలి.

*Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965*